నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | సోమవారం 26 ఆగస్టు 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

సత్యనారాయణస్వామి వ్రతం ఆచరిస్తున్న మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు కుటుంబ సభ్యులు

వైభవంగా పవిత్రోత్సవాలు

దండేపల్లి, ఆగస్టు 25 : మండలంలోని గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో ఆదివారం రెండో రోజూ అత్యంత వైభవంగా పవిత్రోత్సవాలు జరిగాయి. పంచసూక్త పరివార హోమము, గాయత్రి హోమము, మూలమంత్ర హోమము, స్వామివారికి పవిత్రారోహణం, నిత్య పూర్ణాహుతి, బలిహరణము, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈవో శ్రీనివాస్, యజ్ఞాచార్యులు అభిరామచార్యులు, ముఖ్య అర్చకులు గోవర్ధన రఘుస్వామి, వేదపండితులు నారాయణశర్మ, భరత్‌శర్మ, అర్చకులు సంపత్‌స్వామి, జయస్వామి, ఆంజనేయస్వామి ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు పూజలు..

మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, నడిపెల్లి ట్రస్ట్ చైర్మన్ విజిత్‌రావు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో సత్యనారాయణస్వామి వ్రతం ఆచరించారు. అనంతరం పూజారులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

చింతలమాదర జలపాత ప్రాంత అభివృద్ధికి కృషి

ఈటీసీ కమిటీతో మాట్లాడుతున్న జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్ కుమార్

- జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్ కుమార్

తిర్యాణి,ఆగస్టు 25 : చింతలమాదర జలపాత ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తామని జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్‌కుమార్ అన్నారు. ఆదివారం జలపాతంతో పాటు అటవీప్రాంతాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జలపాతం అందాలను వీక్షించేందుకు వచ్చే సందర్శకుల కోసం సౌకర్యాలు కల్పిస్తామన్నారు. జలపాతం వద్ద డ్రెస్సింగ్ రూం, మరుగుదొడ్లు తదితర ఏర్పాట్లు చేయాలని కమిటీని ఆదేశించారు. జలపాతం ద్వారా వచ్చే ఆదాయాన్ని గ్రామ, జలపాత ప్రాంత అభివృద్ధికి ఖర్చు పెట్టాలన్నారు. పాత పద్ధతిలాగే టికెట్లు అమ్మాలని కమిటీకి సూచించారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. సందర్శకుల ద్వారా అడవులకు ఎలాంటి ముప్పు జరుగకుండా చూడాలని అటవీ సిబ్బందికి సూచించారు. జలపాతం చుట్టూ రక్షణ చర్యలు ఉండేలా చూడాలని కమిటీకి సూచించారు. గిన్నెధరి రేంజర్ వెంకన్న, డీఆర్వో ప్రవీణ్‌కుమార్, ఈటీసీ చైర్మన్ తుంరం గోపాల్, ఎఫ్ఎస్‌వో రాంసింగ్, ఎఫ్‌బీవో రాకేశ్ కమిటీ సభ్యులు, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిఖని గనిలో కూలిన రూఫ్

కార్మికులెవరూ లేకపోవడంతో తప్పిన ప్రమాదం

బెల్లంపల్లి, ఆగస్టు 25 : మందమర్రి ఏరియాలోని శాంతిఖని గని షాఫ్ట్‌లో రూఫ్ ఫాల్ అయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. శాంతిఖని షాఫ్ట్‌లో బోల్డర్ మైనర్ (బీఎం) ద్వారా బొగ్గు ఉత్పత్తి జరుగుతోంది. శనివారం ఉదయం షిఫ్ట్‌లో ఏడో డీప్ 65వ లెవల్‌లో బీఎం ద్వారా ఫేస్ కట్టింగ్ ప్రిపరేషన్ పనులు జరుగుతున్నాయి. బోల్డర్ మైనర్ పనులు నిర్వహిస్తున్న సమయంలో సౌత్ సైడ్ కార్నర్ రూఫ్ (5 మీటర్ల పొడవు) ఒక్కసారిగా కుప్పకూలింది. జేఎంఎస్ కార్మికులు 20 మీటర్ల దూరంలో ఉండడంతో ప్రమాదం తప్పింది. సైడ్ ఫాల్ మొత్తం కుప్పకూలిపోతే సమీపంలో పనిచేస్తున్న కార్మికులెవరూ బయటకు రాకుండా ఉండేవారని కార్మికులు చెబుతున్నారు. సుమారు 15 టబ్బుల బొగ్గు కింద పడిపోవడంతో దానిని అక్కడి నుంచి తొలగించే పనులు అధికారులు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నారు. ఈ పనులు ఆదివారం రాత్రి వరకు కొనసాగుతూనే ఉన్నాయి. ఉత్పత్తిపై ప్రభావం పడింది. రెండు రోజుల్లో సగటున 700 నుంచి 800 టన్నుల నష్టం వాటిల్లినట్లు కార్మికులు పేర్కొన్నారు. సేఫ్టీ నిబంధనలు సక్రమంగా పాటించకపోవడంతోనే ప్రమాదం జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పని ప్రదేశానికి బీఎం వెళ్లే ముందు సపోర్టింగ్, బ్యాడ్ రూఫ్ సరిగా ఉందా.. లేదా అని సంబంధిత అధికారులు పర్యవేక్షించాల్సి ఉండగా, ఆ దిశగా చర్యలు తీసుకోవడంతోనే ప్రమాదం జరిగిందని తెలుస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి సేఫ్టీ చర్యలు పకడ్బందీగా తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

పులి కోసం అన్వేషణ

టైగర్ స్థావరం కనిపెట్టేందుకు అడవుల్లో పర్యటిస్తున్న అధికారులు

అడవుల్లో పర్యటిస్తూ సేదతీరుతున్న అధికారులు, స్థానికులు

కెరమెరి, ఆగస్టు 25 : ఉమ్రి గ్రామ సమీపంలోని పత్తి చేనులో పులి పాదముద్రలు గుర్తించిన అటవీశాఖ అధికారులు, దాని స్థావరాన్ని కనిపెట్టేందుకు అడవుల్లో పర్యటిస్తున్నారు. ఆదివారం అటవీ సమీప గ్రామాల ప్రజలతో కలిసి పలు ప్రాంతాల్లో అన్వేషించారు. బోరిలాల్‌గూడ, శంకర్‌లొద్దివంటి దట్టమైన అటవీప్రాంతంలో కలియదిరిగారు. అడవుల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలకు పులి చిక్కకపోవడం అధికారులకు సవాల్‌గా మారింది. శనివారం బోరిలాల్‌గూడలో మేకను హతమార్చడం.. ఉమ్రిలో పాదముద్రాలు కనిపించడంతో ఉన్నది ఒక పులియేనా.. లేక రెండా అనేఅంతుచిక్కడం లేదు. ఏదేమైనా అటవీ సమీపంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్ఆర్వో సయ్యద్ మజారొద్దీన్ సూచించారు.

సాకులు చెబుతూ గోస పెడుతున్నారు

రూ. 2 లక్షల దాకా రుణమాఫీ చేస్తమని మాట తప్పిన్రు

కాంగ్రెస్ సర్కారు వైఖరిపై రైతుల ఆగ్రహం

'నమస్తే తెలంగాణ' విజిట్‌లో అభిప్రాయలు వ్యక్తం చేసిన అన్నదాతలు

'కాంగ్రెస్ రూ. 2 లక్షల దాకా రుణమాఫీ చేస్తామని మాట తప్పింది. అన్ని అర్హతలున్నా లేనిపోని సాకులు చెబుతూ తప్పించుకోవాలని చూస్తుంది. రుణమాఫీ ఎందుకు కాలేదని సార్లను అడిగితే.. తెల్లకాగితాలపై దరఖాస్తులు పెట్టుకోవాలని చెబుతున్నరు. అది లేదు.. ఇది లేదు.. అందుకే మాఫీ కాలేదంటున్నరు. ఇదెక్కడి న్యాయం' అంటూ రైతులు కాంగ్రెస్ సర్కారుపై మండిపడుతున్నారు. ఆదివారం 'నమస్తే తెలంగాణ' బెల్లంపల్లి మండలంలోని చంద్రవెల్లి, కన్నాల, కాసిపేట, కన్నెపల్లి మండలాల్లోని పలు గ్రామాలను సందర్శించి రైతులతో మాట్లాడగా, వారు ఇలా స్పందించారు.

ఫీల్డ్ విజిట్ FIELD VISIT

మా ఇద్దరిలో ఒకరికీ కూడా కాలే

కన్నెపల్లి, ఆగస్టు 25 : కన్నెపల్లి బ్యాంకులో నా పేరు మీద, నా భార్య పేరు మీద క్రాప్ లోన్ ఉంది. ఇద్దరం కలిసి రూ. 2.20 లక్షల లోను తీసుకుంటా కట్టుకుంటున్నం. ఎన్నికలప్పుడు రూ. 2 లక్షలు మాఫీ చేస్తామనంగనే మస్తు సంబురపడ్డం. కానీ ఇప్పుడు మా ఇద్దరిలో ఒకరి కూడా మాఫీ కాలేదు. లేనిపోని లింకులు పెట్టి రైతులను గోస పెట్టుకుంటున్నరు. ఇక్కడ దరఖాస్తు చేసుకోండి, అక్కడ దరఖాస్తు చేసుకోండి అని ఆఫీస్‌ల చుట్టూ తిప్పుతున్నారు. గిదెక్కడి న్యాయం. **- గురుండ్ల హన్మంతు, కన్నెపల్లి**

చెప్పిందొకటి చేసేదొకటి

కన్నెపల్లి, ఆగస్టు 25 : ఎన్నికలప్పుడు రూ. రెండు లక్షల రుణమాఫీ అని చెప్పి ఇప్పుడు రైతులను అరిగోస పెట్టుకుంటున్నరు. కొందరికి చేసి.. మరికొందరికి చేయకపోవడం అన్యాయం. నాకు రూ. 2.30 లక్షల రుణం ఉంది. రూ. 2 లక్షలకు పైగా ఉన్నోళ్లందరినీ కట్టమంటే ఎక్కడికి పోయేది. మళ్లా అప్పులపాలు చేసుడేకదా. ఇప్పటికే బోలెడన్ని అప్పుల్లో ఉన్నాం. ఇకనైనా మాకు న్యాయం చేయాలె. **- వడాయి సురేందర్,కన్నెపల్లి**

కన్నాలలో మస్తు మందికి కాలే..

బెల్లంపల్లి, ఆగస్టు 25 : మా ఊరిలో మస్తు మంది రైతులకు రుణమాఫీ కాలే. సార్లను అడిగితే అది ఉంటే.. ఇది లేదని.. ఇది ఉంటే అది లేదని కొర్రీలు పెడుతున్నరు. ఏదో ఒక సాకు చెబుతున్నరు. నేను రూ. లక్షా 25 వేల రుణం తీసుకున్న. నాకు రుణమాఫీ కాలేదు. ఆధార్‌కార్డులో ఉన్న వివరాలతో సరిపోలేదంటున్నరు. తెల్లకాగితంపై దరఖాస్తు చేసుకుంటే ఉన్నతాధికారులకు పంపిస్తమంటున్నరు. ఎవుసాన్నే నమ్ముకొని జీవిస్తున్నం. కాంగ్రెసోళ్లు గిట్ల ఆశపెట్టి మోసం చేసుడేంది. **- రాజయ్య,కన్నాల**

రుణమాఫీ కపాయె..

కాసిపేట, ఆగస్టు 25 : కాంగ్రెసోళ్లు ఎన్నికలకు ముందు రూ.రెండు లక్షల దాకా రుణ మాఫీ చేస్తమన్నరు. అధికారంలోకి వచ్చాక సాకులు చెబుతున్నరు. నాకు రూ.లక్షా 90 వేల పంట రుణం ఉంది. ఇప్పటి వరకు మాఫీ కాలే. ఎవుసం చేసుకొని బతికేటోళ్లం. ఆఫీసుల చుట్టూ తిరిగి యాష్టకొస్తుంది. కేసీఆర్ సర్కారులో గిట్లా చేయలే. అందరికీ మాఫీ చేసిన్రు. ఇకనైనా సీఎం రేవంత్‌రెడ్డి రైతులను గోస పెట్టకుండా న్యాయం చేయాలె. **- సంకూరి పోశం, కాసిపేట**

ఇదంతా ఎగ్గొట్టేందుకే..

బెల్లంపల్లి, ఆగస్టు 25 : నా పేరు మీదున్న భూమి పేరిట బ్యాంక్‌లో రూ. లక్షా 90 వేల రుణం తీసుకున్న. నాకు రేషన్ కార్డు లేదని రుణమాఫీ కాలేదంటున్నరు. దరఖాస్తు పెట్టుకోమని చెబుతున్నరు. పెట్టుకున్నా రుణమాఫీ చేస్తరన్న నమ్మకం లేదు. కేసీఆర్ సర్కారులో ఇలాంటి నిబంధనలు లేకుండే. రుణం తీసుకున్న ప్రతి రైతుకూ మాఫీ చేసిన్రు. రుణమాఫీని ఎగ్గొట్టేందుకే ఈ నిబంధనలు పెట్టినట్లుంది. ఎవుసం చేసుకునేటోళ్లకు ఈ నిబంధనలేమిటో. గతంలో రుణం తీసుకున్నాం. యేటా కట్టినం. గిప్పుడైతే ఏదేదో చెబుతున్నరు. **- లక్ష్మణ్‌గౌడ్, చంద్రవెల్లి**

ఓపెన్ స్కూల్ పిలుస్తోంది !

- బడి మానేసి.. చదువుకోలేని వారికి సువర్ణావకాశం
- దూర విద్యా విధానంలో ప్రవేశాలకు నోటిఫికేషన్
- రెగ్యులర్‌తో సమానంగా అర్హత

ఓపెన్ ఇంటర్, టెన్త్‌తో అనేక అవకాశాలు

కాసిపేట : ముత్యంపల్లి ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రంలో చదువుకుంటున్న విద్యార్థులు(ఫైల్)

కాసిపేట, ఆగస్టు 25 : వివిధ కారణాలతో చదువు ఆపేసిన, బడి మానేసిన వారికి తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) వరంగా మారింది. వృత్తి పరంగా పనులు చేసుకుంటూనే ఓపెన్ స్కూల్‌లో సెలవు రోజుల్లో చదువుకునే వెసలుబాటు ఉంది. ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యతో ఒకేషనల్ కోర్సులను అభ్యసించవచ్చు. ప్రస్తుతం ఓపెన్ ఇంటర్, టెన్త్ అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదలైంది. ఉమ్మడి జిల్లా కేంద్రంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అడ్మిషన్ల పక్రియ సాగుతున్నది. మంచిర్యాల జిల్లాలో 20 స్టడీ సెంటర్లు, ఆదిలాబాద్ జిల్లాలో 22, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 17, నిర్మల్ జిల్లాలో 25, ఇలా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 84 స్టడీ సెంటర్లున్నాయి. గతేడాది 2023-24 విద్యా సంవత్సరానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదిలాబాద్ జిల్లాలో టెన్త్‌లో 678, ఇంటర్‌లో 365, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో టెన్త్‌లో 369, ఇంటర్‌లో 225, మంచిర్యాల జిల్లాలో టెన్త్‌లో 711, ఇంటర్‌లో 1190, నిర్మల్ జిల్లాలో టెన్త్‌లో 768, ఇంటర్‌లో 485 అడ్మిషన్లు పొందారు. ఈ ఏడాది పదో తరగతిలో 3000, ఇంటర్‌లో 3500 అడ్మిషన్లు తీసుకునే లక్ష్యంతో ముందుకెళ్తున్నారు.

అడ్మిషన్ల అర్హత, దరఖాస్తు విధానం...

ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి చదివేందుకు 14 ఏళ్లు నిండి ఉండాలి. బర్త్ సర్టిఫికెట్ లేదా బడి మధ్యలో మానేస్తే అప్పటి ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్(టీసీ), రికార్డ్ షీటు, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రంతో ప్రవేశం పొందవచ్చు. సెలవు రోజుల్లో తరగతులు నిర్వహించడం, సబ్జెక్టుకు సంబంధించిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాఠాలు బోధిస్తారు. పదో తరగతికి తెలుగు, హిందీ, ఇంగ్లిష్, ఉర్దూ మీడియాలు అందుబాటులో ఉన్నాయి. ఇంటర్ చదవాలనుకునే వారు పదో తరగతి పూర్తి చేసి, 15 ఏళ్లు నిండినవారందరూ అభ్యసించవచ్చు. పదో తరగతి మెమో, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్, ఫొటోలతో దరఖాస్తు చేసుకోవచ్చు. కళాశాల చదువు మానేసిన, ఇంటర్‌లో ఫెయిలైన వారికి మంచి అవకాశం. ఇంటర్‌లో తెలుగు, హిందీ, ఇంగ్లిష్, ఉర్దూ మీడియాలు అందుబాటులో ఉన్నాయి. గ్రూపు- ఏలో భాషలు, గ్రూపు-బీలో ఆప్షనల్స్, గ్రూపు-సీలో విద్యా కోర్సులుంటాయి. సీఈసీ, బైపీసీ, హెచ్ఈసీ, ఎంఈసీ, ఎంపీసీ తదితర గ్రూపులు అందుబాటులో ఉన్నాయి. పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సులో అభ్యాసకులు వృత్తి విద్యా కోర్సును ఒక ఐచ్ఛిక సబ్జెక్టు(గ్రూప్ సీ)గా ఎంపిక చేసుకోవచ్చు. ఇంటర్ గతంలో చదవి ఫెయిలై ఉంటే ఒరిజినల్ ఫెయిల్ మెమోతో టీవోసీ ద్వారా దరఖాస్తులు చేసుకుంటే రెండు సబ్జెక్టులు మినహాయించే విధానం కూడా ఉంది. అడ్మిషన్ పొందిన అనంతరం ఉచితంగా పాఠ్య పుస్తకాలు అందిస్తారు.

అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకునేందుకు తేదీల వివరాలు..

ఓపెన్ స్కూల్లో చేరాలనుకునే వారు www.telanganaopenschool.org వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. మీ సేవ, ఆన్‌లైన్ కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందులో ఉత్తీర్ణులైన వారికి టాస్ ద్వారా ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారు. ఉన్నత విద్య, ఉద్యోగాలకు వినియోగించుకోవచ్చు. ఆసక్తి గల వారు సెప్టెంబర్ 10వ తేదీ లోగా ఎలాంటి ఫైన్ లేకుండా దరఖాస్తు చేసుకునే అవకాశముంది. పదో తరగతికి రూ.100, ఇంటర్‌కు రూ.200 ఫైన్‌తో సెప్టెంబర్ 11 నుంచి అక్టోబర్ 3వ తేదీ వరకు అవకాశముంది. మీ సేవ, ఆన్‌లైన్‌లో మీరు కోరుకున్న అధ్యయన కేంద్రాన్ని ఎంచుకొని, ఆన్‌లైన్‌లో దరఖాస్తుతో పాటు ఫీజు కూడా ఆన్‌లైన్‌లోనే చెల్లించాలి. ఆన్‌లైన్ చేసే క్రమంలో ఒరిజినల్ సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. చెల్లించిన ఫీజు రశీదు, అడ్మిషన్ దరఖాస్తులతో పాటు సర్టిఫికెట్లు, ఫొటోలను జత చేసి, మూడు సెట్ల జిరాక్స్ కాపీలపై గెజిటెడ్ సంతకాలు చేయించి మీరు కోరుకున్న అధ్యయన కేంద్రంలో అప్పగించాలి. అక్కడి అధ్యయన కేంద్రం నుంచి ఉమ్మడి ఆదిలాబాద్ స్థాయి ఓపెన్ స్కూల్ కేంద్రానికి ఆ దరఖాస్తులను పంపిస్తారు. అనంతరం డీఈవోతో నియమించిన అడ్మిషన్ కమిటీ ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి, అర్హులకు అవకాశం కల్పిస్తారు.

టెన్త్, ఇంటర్ అడ్మిషన్ ఫీజు వివరాలు...

ఓపెన్ ఇంటర్, టెన్త్ పూర్తిగా ఆన్‌లైన్‌లోనే అడ్మిషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. మీ సేవ, ఆన్ లైన్ కేంద్రాల్లో చెల్లించాలి. అధ్యయన కేంద్రంలో ఎలాంటి చెల్లింపులు ఉండవు. పదో తరగతికి అడ్మిషన్ ఫీజు ఓసీ పురుషులకు రూ.1400, ఎస్సీ, ఎస్టీ, బీసీ, పురుషులకు, మహిళలకు రూ.1000, రిజిస్ట్రేషన్ ఫీజు రూ.150, ఆఫ్‌లైన్ చార్జీలు అదనంగా ఉంటాయి. ఇంటర్‌కు ఓసీ పురుషులకు రూ. 1500, ఎస్సీ, ఎస్టీ, బీసీ, పురుషులు, మహిళలకు రూ.1200, రిజిస్ట్రేషన్ ఫీజు రూ.300, ఆఫ్‌లైన్ చార్జీలు అదనంగా ఉంటాయి.

అందరికీ అందుబాటులో విద్య..

అందరికీ అందుబాటులో విద్య అందించే లక్ష్యంతో ఓపెన్ స్కూల్ విధానం కొనసాగుతుంది. ఓపెన్ టెన్త్, ఇంటర్ పూర్తి చేసుకున్న వారికి రెగ్యులర్ విద్యతో సమానంగా గుర్తింపు ఉంటుంది. ఉన్నత విద్య, పదోన్నతులు, ఉద్యోగాలు పొందడానికి, మధ్యలో మానేసిన వారికి, గృహిణిలు, వయోజనులకు ఎంతో ఉపయోగం ఉంటుంది. అడ్మిషన్ పొందిన ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్‌లో సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తారు. చాలా మంది ఉద్యోగాలు సాధించడంతో పాటు పై చదువులు చదువుకునేందుకు దోహద పడింది. అందరూ చదువుకోవాలనే లక్ష్యంతో అందరికీ అవగాహన కల్పిస్తూ విస్తృత ప్రచారం చేస్తూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అడ్మిషన్లు చేస్తున్నాం. ఓపెన్ స్కూల్ డైరెక్టర్ పీవీ శ్రీహరి ఆధ్వర్యంలో మెరుగైన విద్య అందిస్తున్నాం. ఓపెన్ స్కూల్‌లో చాలా మార్పులు వచ్చాయి. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని భవిష్యత్‌కు పునాది వేసుకోవాలి.

- నాగుల అశోక్, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్

కృష్ణం వందే జగద్గురుం

- నేడే శ్రీ కృష్ణ జన్మాష్టమి
- ఉట్ల పండుగకు ఏర్పాట్లు

చెన్నూర్ టౌన్, ఆగస్టు 25 : శ్రీకృష్ణుడి జన్మాష్టమిని సోమవారం జరుపుకునేందుకు ప్రజానీకం సిద్ధమైంది. దేవకీ వసుదేవులకు శ్రావణ మాసం కృష్ణ పక్షం అష్టమి తిథిన కంసుడి చెరసాలలో ఆయన జన్మించగా, ఆనాటి నుంచి కృష్ణాష్టమి వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది.

ఉట్ల పండుగ..

శ్రీకృష్ణ జన్మాష్టమి రోజున బాలలకు కృష్ణుడిగా బాలికలకు గోపికలుగా వేషధారణ చేసి ఉట్ల వేడుకను జరుపుకుంటారు. అందనంత ఎత్తులో ఉట్టి కట్టి దాన్ని ఆనందోత్సాహల మధ్య కొడుతూ పండుగ చేసుకుంటారు. ఈ వేడుకల్లో యువకులు, పిల్లలు ఉత్సాహంగా పాల్గొంటారు. ఉట్టికొట్టిన వారికి బహుమతులను కూడా ప్రదానం చేస్తారు. ఆలయాల్లోనే కాకుండా ప్రతి ఇంట్లోనూ కృష్ణాష్టమిని జరుపుకుంటారు. మహిళలు వేకువజామునే లేచి తలస్నానం చేసి ఇంటి ముందు రంగు రంగుల ముగ్గులు వేసి, బియ్యం పిండితో శ్రీకృష్ణుడు ఇంట్లోకి వస్తున్నట్లుగా పాద ముద్రలు వేస్తారు. పూజలు చేసి అటుకులు, పాలు, పెరుగు, మీగడ, వెన్నవంటి వాటిని నైవేద్యాలుగా సమర్పిస్తారు. ఈ రోజున ఉపవాసం చేసి వీధుల్లో ఉట్టికొట్టే వేడుకలు జరుపుకుంటారు.

కొండచిలువల కలకలం

కొండచిలువను పట్టుకున్న స్నేక్ సొసైటీ సభ్యులు

మందమర్రి,ఆగస్టు 25 : మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డు గాంధీనగర్ ఏరియాలో ఆదివారం భారీ కొండచిలువ కలకలం సృష్టించింది. కాలనీకి చెందిన తుమ్మ రవీందర్ ఇంటి ఆవరణలోకి ఆదివారం ఉదయం కొండ చిలువ రావడంతో కుటుంబ సభ్యులు భయపడిపోయారు. అప్పటికే అది పిల్లిని మింగిందని వారు తెలిపారు. సింగరేణి ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్ సొసైటీ సభ్యులు మహేందర్, శ్రీనివాస్ అక్కడికి చేరుకొని కొండ చిలువను పట్టుకున్నారు. ఆపై అటవీ ప్రాంతంలో వదిలేశారు. 10 అడుగులకు పైగా పొడవు ఉంటుందని తెలిపారు. కొండచిలువను చూసేందుకు స్థానికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పాములు కనిపిస్తే 88970 17110లో సంప్రదించాలని కోరారు.

శివాజీనగర్‌లో..

క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు రామకృష్ణాపూర్ శివాజీనగర్ కాలనీలో ఆదివారం సాయంత్రం కొండ చిలువ కనిపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. కాలనీలోని చెట్ల పొదల నుంచి నివాస ప్రాంతాలకు వచ్చిన కొండ చిలువ స్థానికులపై దాడి చేసేందుకు యత్నించడంతో తప్పనిసరి పరిస్థితిలో కొండ చిలువను కొట్టి చంపినట్లు కాలనీ వాసులు తెలిపారు. అధికారులు కాలనీలో పేరుకు పోయిన చెట్ల పొదలను తొలగించాలని వారు కోరారు.

ట్రైనీ ఎఫ్ఆర్వోల క్షేత్రస్థాయి పర్యటన

గుండెపల్లి బేస్ క్యాంప్ వద్ద అధికారులతో కలిసి ట్రైనీ ఎఫ్ఆర్వోలు

పెంచికల్‌పేట్, ఆగస్టు 25 : పెంచికల్‌పేట్ రేంజ్‌లో తెలంగాణ ఫారెస్ట్ అకాడమీ 11వ బ్యాచ్ ట్రైనీ ఎఫ్ఆర్వోలు ఆదివారం క్షేత్ర స్థాయి పర్యటన చేశారు. పులుల కదలికలను గుర్తించడానికి ఇక్కడి అధికారులు అవలంబిస్తున్న విధానాలు, ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు కాలువల నిర్మాణాన్ని అకాడమీ కోర్స్ డైరెక్టర్ డీఎఫ్‌వో వెంకటేశ్వరరావు బృందం పరిశీలించింది. వన్య ప్రాణుల సంరక్షణ, అటవీ సంరక్షణ,గడ్డి మైదానాల పెంపకం, జలపాతాలు, బేస్ క్యాంప్, పాలరాపు గుట్ట రాబందుల స్థావరం తదితర ప్రదేశాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో పెంచికల్‌పేట్ ఎఫ్ఆర్వో అనిల్‌కుమార్, ఎఫ్ఎస్‌వో జగన్మోహన్ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.